# జ్వాల తెలుగు న్యూస్

RNI NO: TELTEL/2023/88524

# మెదక్ టుడే

MEDAK TODAY

తెలుగు దిన పత్రిక...

27 మార్చి 2026 | మెదక్ | పేజీలు :4 వెల రూ.:2 | ఎడిటర్: సిహెచ్. శివకుమార్ | సంపుటి 02 | సంచిక 117


## మార్కాపురంలో... 14 మంది సజీవదహనం!

# మృత్యుఘోష

**నిప్పుల కొలిమిగా మారిన ప్రైవేటు బస్సు..**

**జగిత్యాల నుంచి పామూరు వస్తుండగా తెల్లవారుజామున వెంటాడిన మృత్యువు**

**టిప్పర్‌ను ఢీకొన్న హరేకృష్ణ ట్రావెల్స్ బస్సు**

**క్షణాల్లోనే ఎగసిపడ్డ మంటలు.**

**ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పదిమంది బయటపడ్డా..**

**కళ్లముందే కాలిపోయిన తోటి ప్రయాణికులు.**

**మృతుల్లో మహిళలు, చిన్నారులు.. విషాదంలో మునిగిన కనిగిరి, పామూరు గ్రామాలు.**

**బస్సు కండిషన్‌పై ప్రయాణికుల ఆగ్రహం**



**మార్కాపురం, మార్చి 26:** సంతోషంగా గమ్యస్థానాలకు చేరుకోవాల్సిన ఆ ప్రయాణికులను నిద్రలోనే మృత్యువు కబళించింది. మార్కాపురం జిల్లా రాయవరం సమీపంలో గురువారం తెల్లవారుజామున చోటుచేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదం తెలుగు రాష్ట్రాలను దిగ్భ్రాంతికి గురిచేసింది. కంకర్ లోడ్‌తో వస్తున్న టిప్పర్‌ను ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు బలంగా ఢీకొనడంతో రెండు వాహనాలు నిప్పుల కొలిమిగా మారాయి. ఈ దుర్ఘటనలో 14 మంది ప్రయాణికులు బస్సులోనే సజీవదహనమయ్యారు.

**ఘటన జరిగిన తీరు:**
తెలంగాణలోని జగిత్యాల నుంచి ప్రకాశం జిల్లా పామూరుకు వెళ్తున్న 'హరేకృష్ణ ట్రావెల్స్' బస్సులో మొత్తం 35 మంది ప్రయాణికులు ఉన్నారు. తెల్లవారుజామున 6 గంటల సమయంలో మార్కాపురం సమీపంలోని పలకల క్వారీల వద్ద ఎదురుగా వస్తున్న టిప్పర్‌ను బస్సు ఢీకొంది. ఈ ఘర్షణతో డీజిల్ ట్యాంకు పేలి మంటలు వేగంగా వ్యాపించాయి. నిద్రమత్తులో ఉన్న ప్రయాణికులు తేరుకునేలోపే బస్సును అగ్నికీలలు చుట్టుముట్టాయి. సుమారు 10 మంది కిటికీల నుంచి బయటకు దూకి ప్రాణాలు రక్షించుకోగా, మిగిలిన వారు మంటల మధ్య చిక్కుకుపోయారు.

**క్షతగాత్రుల ఆర్తనాదాలు:**
ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు, పోలీసులు సహాయక చర్యలు చేపట్టినప్పటికీ మంటల తీవ్రత ఎక్కువగా ఉండటంతో లోపల ఉన్నవారిని కాపాడటం సాధ్యపడలేదు. 13 మంది అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్రంగా గాయపడిన 22 మందిని మార్కాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా

మిగతా 2లో

## యుద్ధ మేఘాల నీడలో భారత్



**నేడు ప్రధాని మోదీ 'వార్ రూమ్' భేటీ!**

**దేశ ఆర్థిక భద్రతపై ప్రధాని అత్యవసర సమీక్ష**

**చమురు సెగ తగలకుండా 'యాక్షన్ ప్లాన్'**

**అన్ని రాష్ట్రాల సీఎంలతో వీడియో కాన్ఫరెన్స్**

**విదేశీ భారతీయుల రక్షణే తొలి ప్రాధాన్యత**

**రాజకీయాలకతీతంగా 'టీమ్ ఇండియా' ఐక్యతకు పిలుపు**

2

## వదంతులు నమ్మకండి

**పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ సరఫరాపై కేంద్రం క్లారిటీ**

**150 దేశాలకు ఎగుమతి చేస్తున్నాం**

**మన రిఫైనరీలు 100% పక్కా**

**వ్యూహాత్మక నిల్వలు సిద్ధం**

**భయాందోళనతో ఎక్కువ కొనొద్దని విజ్ఞప్తి**

2



## మతం మారితే...

## కులం మారుతుందా

**అధికారంలోకి వస్తే దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా**

**ఉత్తరాది పెత్తనం సాగనివ్వం..**

**నియోజకవర్గాల పునర్విభజనపై హెచ్చరిక.**

**మోదీ విదేశాంగ విధానం ఫెయిల్..**

**దేశంలో పెట్రోల్, గ్యాస్ కష్టాలు**

**మాజీ కేంద్ర మంత్రి చింతా మోహన్**

2



**ఆరోగ్యశ్రీపై అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి శ్వేతపత్రం**

**గత ప్రభుత్వ బకాయిలు చెల్లిస్తూనే ఆరోగ్యశ్రీ పరిమితి రూ.10 లక్షలకు పెంపు..**

**ఉస్మానియాకు రూ.3వేల కోట్లు!**

### పేదల వైద్యానికి...

## అత్యంత ప్రాధాన్యత



**హైదరాబాద్ మార్చి 26:** రాష్ట్రంలో పేదల వైద్యానికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని, వైద్యం కోసం ఖర్చు చేసే నిధుల్లో ఒక్క రూపాయి కూడా కోత విధించబోమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ వేదికగా స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో పేరుకుపోయిన బకాయిలను మోస్తూనే, ఆరోగ్యశ్రీ పరిమితిని పెంచి సామాన్యులకు భరోసా కల్పిస్తున్నామని ఆయన వివరించారు.

**ఆరోగ్యశ్రీ: గణాంకాల్లో మార్పు** గత ప్రభుత్వంతో పోలిస్తే ఆరోగ్యశ్రీ కింద చేస్తున్న ఖర్చును తమ ప్రభుత్వం గణనీయంగా పెంచిందని సీఎం వివరించారు:

బీఆర్ఎస్ హయాంలో నెలకు సగటున రూ.52 కోట్లు ఖర్చు చేస్తే, ప్రస్తుతం తమ ప్రభుత్వం రూ.89 కోట్లు వెచ్చిస్తోంది. గత ప్రభుత్వం వదిలివెళ్లిన రూ.600.27 కోట్ల బకాయిలను కూడా తమ ప్రభుత్వమే భరిస్తోంది.ఇప్పటివరకు ప్రభుత్వం మొత్తం రూ.2,408.51 కోట్లు విడుదల చేసింది. ఇందులో ప్రభుత్వ ఆస్పత్రులకు

మిగతా 2లో

2

**ఎన్‌హెచ్‌ఆర్సీ**

## సీరియస్

**రాజమండ్రి కల్తీ పాల విషాదంపై ప్రభుత్వానికి నోటీసులు!**

**16 మంది మృతిపై 'సుమోటో'గా విచారణ..**

**రెండు వారాల్లో సమగ్ర నివేదిక ఇవ్వాలని సీఎస్‌కు ఆదేశం**

## ప్రభుత్వానిది నిరుద్యోగుల పట్ల నమ్మకద్రోహం

**అసెంబ్లీలో హరీశ్‌రావు నిప్పులు** ***ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాల హామీ ఏమైంది?***

***పీఆర్సీ గడువు పెంపుపై మాజీ మంత్రి ధ్వజం***



**హైదరాబాద్ మార్చి 26:** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు అసెంబ్లీ సాక్షిగా ధ్వజమెత్తారు. అసెంబ్లీలో గురువారం జరిగిన చర్చలో ఆయన పాల్గొంటూ.. ఉద్యోగాల భర్తీ, పీఆర్సీ బకాయిలు, పోలీసు సంక్షేమం వంటి అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీశారు.

నిరుద్యోగులు, ఉద్యోగులకు మొండిచేయేనా?

మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం వెనుకబడిందని హరీశ్‌రావు విమర్శించారు:

ఉద్యోగాల భర్తీ: ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలు

మిగతా 2లో

## కొత్త పార్టీ 'భరోసా' ఆవిర్భావం

**క్రైస్తవుల గొంతుకగా అసెంబ్లీకి వెళ్తామన్న అభినయ్ దర్శన్!**

**పాస్టర్ ప్రవీణ్ పగడాల వర్ధంతి రోజే పార్టీ ప్రకటన..**

**అరకు నుంచి పాదయాత్ర.. 10 స్థానాల్లో పోటీకి సై!**

2



## పేదల వైద్యానికి అత్యంత ప్రాధాన్యత

రూ.927 కోట్లు, ప్రైవేటు ఆస్పత్రులకు రూ.1,480 కోట్లు చెల్లించినట్లు సీఎం గణాంకాలను వెల్లడించారు.

**వైద్య రంగంలో విప్లవాత్మక సంస్కరణలు**

వైద్య సేవలను మరింత చేరువ చేసేందుకు ప్రభుత్వం పలు కొత్త నిర్ణయాలను ప్రకటించిందిపేదలకు మెరుగైన చికిత్స అందాలనే ఉద్దేశంతో ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుండి రూ.10 లక్షలకు పెంచినట్లు తెలిపారు.గోషామహల్‌లోని 30 ఎకరాల విస్తీర్ణంలో రూ.3,000 కోట్లతో అత్యాధునిక హంగులతో కొత్త ఉస్మానియా ఆస్పత్రిని నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. ప్రతి కుటుంబానికి సామాజిక భద్రత కల్పించేలా కొత్త జీవిత బీమా పథకాన్ని తీసుకురాబోతున్నట్లు సీఎం ప్రకటించారు.టీచింగ్ ఆస్పత్రుల పర్యవేక్షణ బాధ్యతలను గ్రూప్-1 అధికారులకు అప్పగించనున్నట్లు తెలిపారు.

**సీఎంఆర్ఎఫ్ అవినీతిపై విచారణ**

గత ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి సహాయ నిధిచెక్కుల పంపిణీలో భారీ ఎత్తున అవినీతి జరిగిందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఈ నిధులు ఎలా దుర్వినియోగం అయ్యాయనే అంశంపై ప్రస్తుతం విచారణ జరుగుతోందని, బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

**భవిష్యత్తు ప్రణాళిక – నిపుణుల సేవలు**

"వైద్యం, విద్య మా ప్రభుత్వానికి రెండు కళ్ళు. విదేశాల్లో ఉన్న నిపుణులైన వైద్యుల సేవలను కూడా రాష్ట్ర ప్రజల కోసం ఉపయోగించుకుంటాం" అని సీఎం అన్నారు. వైద్య రంగంలో మరిన్ని సంస్కరణలు తీసుకువస్తామని, ప్రతిపక్ష సభ్యులు ఇచ్చే నిర్మాణాత్మక సలహాలను స్వీకరిస్తామని సభలో పేర్కొన్నారు.

## "మతం మారితే కులం మారుతుందా?"

హైదరాబాద్: మతం మారిన దళితులకు ఎస్సీ హోదా వర్తించదంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై మాజీ కేంద్ర మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత చింతా మోహన్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. హైదరాబాద్ ప్రెస్ క్లబ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ తీర్పులోని లోపాలను ఎత్తిచూపుతూ కేంద్ర ప్రభుత్వ విదేశాంగ విధానంపై కూడా విమర్శలు గుప్పించారు.

**రాజ్యాంగ సవరణే లక్ష్యం: క్రైస్తవులకు ఎస్సీ హోదాపై హామీ**

దళిత క్రైస్తవుల సామాజిక స్థితిగతులపై చింతా మోహన్ కీలక వ్యాఖ్యలు చేశారు."మాల, మాదిగ సామాజిక వర్గాల వారు బౌద్ధం స్వీకరిస్తే ఎస్సీలుగానే ఉంటున్నారు. కానీ, క్రైస్తవ మతం తీసుకుని బైబిల్ పట్టుకున్నంత మాత్రాన వారి అంటరానితనం పోతుందా? వారు రెడ్డి, కమ్మ, రాజులు అయిపోతారా?" అని ప్రశ్నించారు.

లి కాంగ్రెస్ అధికారంలోకి వస్తే: 2029లో కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత, రాజ్యాంగ సవరణ చేసి మరీ దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించేలా చేస్తానని ఆయన ధీమా వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయి పరిస్థితులపై ఢిల్లీ పెద్దలకు అవగాహన లేదని విమర్శించారు.

**విదేశాంగ విధానంపై విమర్శలు: రాజీవ్ గాంధీ పాలనతో పోలిక**

ప్రధాని మోదీ విదేశాంగ విధానం వల్ల దేశం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటోందని చింతా మోహన్ ఆరోపించారు.

పశ్చిమాసియా యుద్ధాన్ని సాకుగా చూపి ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం సరికాదన్నారు. దీనివల్ల గ్యాస్ కొరత ఏర్పడిందని, పెట్రోల్ బంకుల వద్ద క్యూలైన్లు కనిపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.1991లో యుద్ధ మేఘాలు కమ్ముకున్నప్పుడు రాజీవ్ గాంధీ చొరవ తీసుకుని సద్దాం హుస్సేన్‌తో మాట్లాడి యుద్ధాన్ని విరమింపజేశారని, ప్రస్తుత ప్రభుత్వంలో అటువంటి సమర్థ నాయకత్వం కరువైందని విమర్శించారు.

**నియోజకవర్గాల పునర్విభజన: దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం**

నియోజకవర్గాల పెంపు అంశంపై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను చింతా మోహన్ సమర్థించారు.దేశానికి 70 శాతం పన్నులు దక్షిణాది రాష్ట్రాల నుండే వెళ్తున్నాయని, కానీ సీట్ల సంఖ్యలో ఉత్తరాదికే ప్రాధాన్యత పెంచడం దారుణమని మండిపడ్డారు. అంతా యూపీ, బిహార్ చేతుల్లోకి వెళితే దేశం రెండు ముక్కలయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అయితే, మహిళా రిజర్వేషన్లను మాత్రం తాను స్వాగతిస్తున్నట్లు స్పష్టం చేశారు.

## మార్కాపురంలో మృత్యుఘోష

ఉండటంతో మెరుగైన చికిత్స కోసం గుంటూరుకు తరలించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

**యాజమాన్యం నిర్లక్ష్యమే కారణమా?**

బస్సు కండిషన్ సరిగా లేకపోవడమే ఈ విపత్తుకు కారణమని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. యర్రగొండపాలెం వద్దే బస్సులో సాంకేతిక లోపం తలెత్తిందని, గంటసేపు నిలిపివేసి మరమ్మతులు చేసినా మళ్లీ ప్రయాణాన్ని కొనసాగించారని వారు వాపోతున్నారు. డ్రైవర్ చెప్పిన సమాచారం ప్రకారం.. స్టీరింగ్ అకస్మాత్తుగా స్ట్రక్ కావడంతో బస్సు అదుపుతప్పి ఎదురుగా వస్తున్న టిప్పర్‌ను ఢీకొట్టింది.

**ప్రభుత్వ స్పందన:** ఈ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించిన సీఎం, మృతుల కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. గాయపడిన వారికి అత్యుత్తమ వైద్యం అందించాలని, ప్రమాద కారణాలపై సమగ్ర విచారణ జరిపి నివేదిక సమర్పించాలని కలెక్టర్, ఎస్పీలను ఆదేశించారు.

## వదంతులు నమ్మకండి...

**న్యూఢిల్లీ మార్చి 26:** పశ్చిమాసియా యుద్ధం కారణంగా దేశంలో చమురు కొరత ఏర్పడుతుందనే ప్రచారానికి కేంద్ర పెట్రోలియం శాఖ తెరదించింది. పెట్రోల్ బంకుల వద్ద వాహనదారులు బారులు తీరుతున్న నేపథ్యంలో, కేంద్రం గురువారం ఒక అత్యవసర ప్రకటన విడుదల చేసింది. "దేశంలో చమురు కొరత లేదు.. అంతా సాధారణమే" అని కుండబద్దలు కొట్టింది.

**నిల్వలు ఎంత ఉన్నాయి?**

యుద్ధం మొదలై 27 రోజులు కావస్తున్నా, భారత్ వద్ద అపారమైన నిల్వలు ఉన్నాయని ప్రభుత్వం గణాంకాలతో వివరించింది కంపెనీల వద్ద 60 రోజులకు సరిపడా చమురు ఉంది. వీటిని కలిపితే మొత్తం 74 రోజులకు సరిపడా నిల్వలు అందుబాటులో ఉన్నాయి. వంటగ్యాస్ ఉత్పత్తిని కూడా పెంచామని, ఎక్కడా లోటు లేదని స్పష్టం చేసింది.

**వదంతులపై హెచ్చరిక:** కొందరు ఉద్దేశపూర్వకంగా చేస్తున్న తప్పుడు ప్రచారం వల్లే వినియోగదారులు ఆందోళనకు గురై, అవసరానికి మించి ఇంధనాన్ని కొనుగోలు చేస్తున్నారని కేంద్రం గుర్తించింది. ఈ 'పానిక్ బయింగ్' వల్ల అనవసరపు రద్దీ ఏర్పడుతోందని, ధరలు కూడా స్థిరంగానే ఉన్నాయని వెల్లడించింది.

**ప్రపంచంలోనే అగ్రగామిగా భారత్:** భారతదేశం పెట్రో ఉత్పత్తుల వినియోగంలో 5వ స్థానంలో, రిఫైనరీ సామర్థ్యంలో 4వ స్థానంలో ఉంది. మన రిఫైనరీలు 100 శాతం సామర్థ్యంతో పని చేస్తూ, ఏకంగా 150 దేశాలకు పెట్రో ఉత్పత్తులను ఎగుమతి చేస్తున్నాయని కేంద్రం గర్వంగా ప్రకటించింది. ఇప్పటికే సముద్ర మార్గంలో మరిన్ని చమురు కార్గోలు భారత్ వైపు వస్తున్నాయని, సరఫరా గొలుసులో ఎలాంటి అడ్డంకులు లేవని తెలిపారు.

## కొత్త పార్టీ 'భరోసా' ఆవిర్భావం

**కాకినాడ మార్చి 26:** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మరో కొత్త పార్టీ ఉద్భవించింది. రాష్ట్రంలోని క్రైస్తవ మైనారిటీల హక్కుల కోసం పోరాడటమే లక్ష్యంగా 'భరోసా' పార్టీని ఏర్పాటు చేస్తున్నట్లు అభినయ్ దర్శన్ ప్రకటించారు. కాకినాడలో నిర్వహించిన ఆవిర్భావ సభలో ఎరుపు, ముదురు నీలం రంగులతో కూడిన పార్టీ జెండాను ఆయన ఆవిష్కరించారు.

**పాస్టర్ ప్రవీణ్ పగడాల స్ఫూర్తితో..**

ప్రముఖ క్రైస్తవ ఆధ్యాత్మిక వేత్త పాస్టర్ ప్రవీణ్ పగడాల ప్రథమ వర్ధంతి రోజే ఈ పార్టీని ప్రకటించడం వెనుక బలమైన కారణం ఉందని అభినయ్ తెలిపారు. ప్రవీణ్ పగడాల మరణం క్రైస్తవ సమాజంలో పెద్ద శూన్యాన్ని మిగిల్చిందని, ఆయన గొంతు మూగబోయిన చోటే తన గొంతు వినిపిస్తుందని ఆయన పేర్కొన్నారు. రాజమండ్రి ఆసుపత్రి వద్ద వేలాది మంది న్యాయం కోసం ఎదురుచూసినా, అండగా నిలబడే రాజకీయ శక్తి లేకపోవడమే ఈ పార్టీ ఆవిర్భావానికి పునాది అని వివరించారు.

**పార్టీ ప్రధాన లక్ష్యాలు – అభినయ్ దర్శన్ మాటల్లో:**

రాజకీయ ప్రాతినిధ్యం: ఏపీలో దాదాపు 2 కోట్ల మంది క్రైస్తవులు ఉన్నారని, వారి సమస్యలను అసెంబ్లీలో వినిపించేందుకు ఒక్క ఎమ్మెల్యే కూడా లేకపోవడం బాధాకరమని ఆయన అన్నారు.

30-40 మంది ఎమ్మెల్యేలే లక్ష్యం: భవిష్యత్తులో కనీసం 30 నుండి 40 మంది క్రైస్తవ ఎమ్మెల్యేలను అసెంబ్లీకి పంపడమే తన జీవిత ఆశయమని ప్రకటించారు.

డబ్బుకు తావులేని రాజకీయం: ఓటును నోటుకు అమ్ముకోవద్దని ప్రజలను చైతన్య పరుస్తానని, తాను కూడా ఎవరికీ డబ్బులు ఇచ్చి ఓట్లు కొనబోనని స్పష్టం చేశారు. కేవలం గుర్తింపు ఉన్న వ్యక్తులకే టికెట్లు ఇస్తామని, వారి తరపున తానే ప్రచారం చేస్తానని భరోసా ఇచ్చారు.

**ఇల్లు వదిలి.. ప్రజల చెంతకు..**

పార్టీ కోసం, పాదయాత్ర కోసం తన సొంత వస్తువులను అమ్ముకున్నానని, ఎన్నికలు ముగిసే వరకు మళ్లీ ఇంటి గడప తొక్కబోనని అభినయ్ భావోద్వేగంతో చెప్పారు. జనవరి 24న అరకు నుంచి ప్రారంభమైన తన పాదయాత్ర ద్వారా ఇప్పటికే 110 గ్రామాల్లో పర్యటించానని, సామాన్యులతో చర్చల్లో నేల మీద నిద్రిస్తూ ప్రజల కష్టాలను తెలుసుకుంటున్నానని తెలిపారు.

**వచ్చే ఎన్నికల్లో వ్యూహం:**

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో 10 నియోజకవర్గాల్లో మాత్రమే భరోసా పార్టీ అభ్యర్థులను బరిలోకి దింపుతుందని, అందులో కనీసం ఐదుగురిని ఎమ్మెల్యేలుగా గెలిపించుకుంటానని అభినయ్ ఛాలెంజ్ చేశారు. ఏ పార్టీకి తాము వ్యతిరేకం కాదని, కేవలం అవినీతికి, అరాచకానికి వ్యతిరేకంగా పోరాడుతామని స్పష్టం చేశారు. తాను కేఏ పాల్‌తో కలవడం లేదని, ఒంటరిగానే పోరాటం చేస్తానని ఆయన క్లారిటీ ఇచ్చారు. క్రైస్తవ ఓట్లతో గెలిచి, వారికి కష్టం వస్తే మాట్లాడని నాయకులకు బుద్ధి చెప్పడమే ఈ పార్టీ ఉద్దేశమని ముగించారు.

## యుద్ధ మేఘాల నీడలో భారత్

**న్యూఢిల్లీ మార్చి 26:** పశ్చిమాసియాలో ఇరాన్ యుద్ధ వాతావరణం మరియు అంతర్జాతీయంగా నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో భారత ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ సంక్షోభం దేశ ఆర్థిక వ్యవస్థపై, ముఖ్యంగా ఇంధన సరఫరాపై ప్రభావం చూపే అవకాశం ఉండటంతో.. ప్రధాని నరేంద్ర మోదీ నేడు (శుక్రవారం) అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో కీలక సమావేశాన్ని నిర్వహించనున్నారు.

**ముఖ్యమంత్రులతో మంతనాలు:**

రేపు సాయంత్రం 6:30 గంటలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగే ఈ భేటీలో యుద్ధం కారణంగా దేశంలో తలెత్తే పరిణామాలపై ప్రధాని చర్చించనున్నారు. ప్రధానంగా ఈ క్రింది అంశాలపై దృష్టి సారించనున్నారు అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు పెరిగితే, దేశీయంగా సామాన్యులపై భారం పడకుండా తీసుకోవాల్సిన చర్యలు. నిత్యావసర వస్తువుల రవాణాలో ఆటంకాలు కలగకుండా ముందస్తు ప్రణాళికలు. యుద్ధ ప్రభావిత ప్రాంతాల్లో ఉన్న భారతీయ పౌరుల భద్రత మరియు వారిని క్షేమంగా స్వదేశానికి తీసుకువచ్చే ప్రక్రియపై రాష్ట్రాలతో సమన్వయం.

**రాష్ట్రాల భాగస్వామ్యం – 'టీమ్ ఇండియా' స్ఫూర్తి:**

దేశం ఎదుర్కొంటున్న ఈ క్లిష్ట సమయంలో కేంద్రం, రాష్ట్రాలు కలిసికట్టుగా 'టీమ్ ఇండియా'గా పని చేయాలని ప్రధాని పిలుపునిచ్చారు. స్థానిక స్థిరత్వాన్ని కాపాడుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వాల సహకారం అత్యంత అవసరమని ఈ సందర్భంగా చర్చించనున్నారు.

**ఎన్నికల కోడ్ మరియు ప్రత్యామ్నాయాలు:**

ప్రస్తుతం ఎన్నికలు జరుగుతున్న రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఎన్నికల నియమావళి (వీశీసవశ్రీ జశీసవ శీట జశీఅఎబష్) కారణంగా ఈ భేటీకి దూరంగా ఉండే అవకాశం ఉంది. అయితే, ఆయా రాష్ట్రాల పాలనా యంత్రాంగం వెనకబడకుండా ఉండేందుకు కేంద్ర క్యాబినెట్ సెక్రటేరియట్ ఆయా రాష్ట్రాల చీఫ్ సెక్రెటరీలతో (జూ) ప్రత్యేకంగా సమావేశమై, కేంద్రం తీసుకునే నిర్ణయాలను వారికి వివరిస్తుంది.

**కీలక నిర్ణయాలు వచ్చే అవకాశం:**

ముఖ్యమంత్రులతో చర్చల అనంతరం, దేశ ప్రయోజనాల దృష్ట్యా ప్రధాని మోదీ కీలక నిర్ణయాలను ప్రకటించే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. అంతర్జాతీయ సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు దేశం సిద్ధంగా ఉందనే భరోసాను ఈ సమావేశం ద్వారా కల్పించనున్నారు.

## ప్రభుత్వానిది నిరుద్యోగుల పట్ల నమ్మకద్రోహం

ఇస్తామని చెప్పి, ఇప్పటి వరకు కేవలం 16,978 ఉద్యోగాలు మాత్రమే ఇచ్చారని ప్రభుత్వం ఒప్పుకోవడం నిరుద్యోగులను మోసం చేయడమేనన్నారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే పీఆర్సీ ఇస్తామని చెప్పి, ఇప్పుడు కమిషన్ గడువును మరో ఆరు నెలలు పొడిగించడంపై ఆయన మండిపడ్డారు. ఇది ఉద్యోగులకు చేస్తున్న నమ్మకద్రోహమని, కేసీఆర్ హయాంలో నివేదిక రాకముందే 5 శాతం ఐఆర్ ఇచ్చి, మొత్తంగా 72 శాతం ఫిట్‌మెంట్ అందించిన విషయాన్ని గుర్తు చేశారు. పదవీ విరమణ చేసిన 600 మంది ఉద్యోగులు తమ బెనిఫిట్స్ కోసం కోర్టుకు వెళ్లాల్సి రావడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని, అందరికీ తక్షణమే పెన్షన్ ప్రయోజనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

**పాలనలో అస్థిరత – ఐపీఎస్‌ల బదిలీలపై ప్రశ్నలు**

రాష్ట్రంలో అధికారుల బదిలీలు అతిగా జరుగుతున్నాయని, దీనివల్ల పాలనపై పట్టు తప్పుతోందని హరీశ్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. గత 28 నెలల్లో సుమారు 140 మంది ఐపీఎస్‌లను మార్చారని, కీలక శాఖలైన విద్యుత్, మున్సిపల్, మైనింగ్, విద్యాశాఖల్లో ఐదుగురు నుండి ఆరుగురు కమిషనర్లు మారడం ఏంటని ప్రశ్నించారు. ఆరోగ్యశ్రీలో ఏకంగా 8 మంది సీఈవోలు మారడాన్ని ఆయన తప్పుబట్టారు.

పోలీసు సంక్షేమం – శాంతిభద్రతలు

పోలీసు శాఖకు బడ్జెట్ తగ్గించడంపై హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు:

గత ఏడాదితో పోలిస్తే పోలీసు శాఖకు రూ.400 కోట్లు తగ్గించడం వల్ల శాంతిభద్రతలపై ప్రభావం పడుతుందన్నారు. 30 జిల్లాల పోలీసులకు టీఏలు, సరెండర్ లీవ్‌లు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే విడుదల చేయాలని కోరారు. కోదాడలో దళిత యువకుడు కర్ల రాజేశ్ లాకప్ డెత్‌కు గురైన ఘటనపై విచారణ జరిపి, బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

**ప్రభుత్వానికి హరీశ్‌రావు ప్రశ్నలు.. డిమాండ్లు:**

ఆర్టీసీ విలీనం: ఆర్టీసీ ఉద్యోగులను ఎప్పటి నుంచి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తారో స్పష్టమైన తేదీని ప్రకటించాలి.

ఖాళీల భర్తీ: పోలీస్ శాఖలో ఖాళీగా ఉన్న 17 వేల కానిస్టేబుల్ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలి.

ఆటో కార్మికుల బోర్డు: ఆటో కార్మికుల సంక్షేమ బోర్డును ఎప్పుడు ఏర్పాటు చేస్తారో వివరించాలి. స్థానిక ఎన్నికలు: వాయిదా పడుతున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలను తక్షణమే నిర్వహించాలి.

## ఎన్‌హెచ్ఆర్సీ సీరియస్..

రాజమండ్రి/న్యూఢిల్లీ మార్చి 26: రాజమండ్రిని వణికించిన కల్తీ పాల ఘటన ఇప్పుడు దేశ రాజధాని వరకు చేరింది. 16 మంది ప్రాణాలను బలితీసుకున్న ఈ ఘోర కలివిని అత్యంత తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘనగా పరిగణించిన జాతీయ మానవ హక్కుల కమిషన్ (టీఎ=జ), దీనిపై 'సుమోటో'గా విచారణ చేపట్టింది. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే ఇలాంటి ఘటనలపై ప్రభుత్వం తీసుకున్న చర్యలేమిటో చెప్పాలని నిలదీసింది.

**కమిషన్ ఆగ్రహం – కీలక ఆదేశాలు:**

ఈ ఉదంతంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కి ఎన్‌హెచ్ఆర్సీ నోటీసులు జారీ చేసింది. ఘటనకు దారితీసిన పరిస్థితులు, బాధితులకు అందించిన పరిహారం, మరియు నిందితులపై తీసుకున్న చట్టపరమైన చర్యలపై రెండు వారాల్లోగా పూర్తిస్థాయి నివేదిక సమర్పించాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. ప్రజారోగ్యాన్ని కాపాడటంలో విఫలమవ్వడాన్ని సీరియస్‌గా పరిగణించిన కమిషన్, మళ్లీ ఇలాంటి విపత్తులు సంభవించకుండా ప్రభుత్వం చేపట్టబోయే ముందస్తు రక్షణ చర్యలను కూడా వివరించాలని సూచించింది.

**విషతుల్యమైన 'ఇథైలిన్ గ్లైకాల్':**

గత నెల ఫిబ్రవరి 16న రాజమండ్రిలో చోటుచేసుకున్న ఈ విషాదంలో పాల వ్యాపారి ఎ. గణేశ్వరరావు విక్రయించిన పాలు తాగిన చిన్నారులు, వృద్ధులు అస్వస్థతకు గురయ్యారు. ఫోరెన్సిక్ దర్యాప్తులో పాలల్లో 'ఇథైలిన్ గ్లైకాల్' అనే ప్రమాదకర రసాయనం కలిపినట్లు తేలింది. ఈ విషపూరిత పాలు తాగి ఇప్పటివరకు 16 మంది మరణించగా, మరికొందరు వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు.నిందితుడు గణేశ్వరరావును పోలీసులు ఇప్పటికే అరెస్ట్ చేసి కఠిన సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు.

**మానవ హక్కుల కోణం:**

ఆహారం ద్వారా విషం శరీరంలోకి చేరి మరణాలు సంభవించడం అనేది జీవించే హక్కును హరించడమేనని మానవ హక్కుల సంఘం అభిప్రాయపడింది. ప్రభుత్వ పర్యవేక్షణ లోపం వల్లే ఇలాంటి కల్తీ వ్యాపారులు రెచ్చిపోతున్నారని విశ్లేషకులు భావిస్తున్నారు. జాతీయ కమిషన్ జోక్యంతో ఈ కేసులో విచారణ మరింత వేగవంతం కానుంది.

# సాయిబాబా కాలనీలో

# శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవానికి రంగం సిద్ధం

### అన్నదానంతో ఘనంగా నిర్వహణకు ఏర్పాట్లు.

### -అధ్యక్షుడు మంగ శంకర్ (ఏ ఎస్ ఎస్ జి) వెల్లడి.

**(స్పెషల్ కరస్పాండెంట్)షాద్ నగర్,మార్చి,26,మెదక్ టుడే న్యూస్:** షాద్‌నగర్ మున్సిపల్ పరిధిలోని ఆరవ వార్డు సాయిబాబా కాలనీలో ఉన్న శివాలయ ప్రాంగణంలో, ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద శ్రీరామనవమి సందర్భంగా నిర్వహించే శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మంగ శంకర్ (ఏ ఎస్ ఎస్ జి) ఒక ప్రకటనలో తెలిపారు.



ప్రతి సంవత్సరం కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఈ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోంది. ఈ ఏడాది కూడా కమిటీ అధ్యక్షుడు మంగ శంకర్ (ఏ ఎస్ ఎస్ జి) ఆధ్వర్యంలో వేడుకను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అధ్యక్షుడితోపాటు కమిటీ కార్యదర్శి బొబ్బిలిగామ శ్రీనివాసులు కూడా తెలిపారు.శుక్రవారం నిర్వహించనున్న శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం సందర్భంగా భక్తులకు అన్నదానప్రసాదం కార్యక్రమం కూడా ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి



కళ్యాణోత్సవాన్ని తిలకించి, అనంతరం భోజన తాంబూలాలను స్వీకరించాలని కమిటీ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమ నిర్వహణలో సమన్వయకర్తగా డాక్టర్ కొమ్ము వెంకన్న బాబు ప్రత్యేక శ్రద్ధ వహించి పర్యవేక్షణ చేసినట్లు అధ్యక్షుడు మంగ శంకర్ (ఏ ఎస్ ఎస్ జి) పేర్కొన్నారు.మహోత్సవాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, అందరూ ఆహ్వానితులేనని కమిటీ సభ్యులు తెలిపారు.

# చేగుంట సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన చెరుకు శ్రీనివాస్ రెడ్డి, సర్పంచ్ సంద్రుగు స్రవంతి సతీష్

### కాంగ్రెస్ ప్రభుత్వం తోనే అభివృద్ధి చెరుకు శ్రీనివాస్ రెడ్డి

**చేగుంట మార్చి 26 మెదక్ టుడే న్యూస్** చేగుంట మండల కేంద్రశీలో 30 లక్షల రూపాయలతో చేపడుతున్న సిసి రోడ్డు పనులను ప్రారంభించిన సర్పంచ్ స్రవంతి సతీష్, వార్డు సభ్యులు చెరుకు శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు చెరుకు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ చేగుంట మండల శీలో 2 కోట్ల 20 లక్షల రూపాయలతో డ్రైనేజీ సిసి రోడ్డు పను లు జరుగుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత దాదాపు 600 ఇండ్లు ఇప్పటివరకు ఎవ్వరు ఇవ్వని విధంగా కాంగ్రెస్ పార్టీ ఇవ్వడం జరిగింది రాబోయే రోజుల్లో చేగుంట వడియారం రెడ్డిపల్లి గ్రామాలలో ఇల్లు లేని నిరుపేదలకు ఇల్లు కట్టించే బాధ్యత కాంగ్రెస్ పార్టీదే సార్వత్రిక ఎన్నికల లోపల ప్రతి గల్లీలో డ్రైనేజీ సిసి రోడ్లు నిర్మిస్తాం బిఆర్ఎస్ ప్రభుత్వం ఏమి చేసిందో ప్రజలకు అర్థమైంది వాళ్ళ మాయ మాటలు విని మోసపోకండి. ప్రజా ప్రభుత్వం మా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వం బలపరిచిన అభ్యర్థిని గెలిపించుకోవాలి అని ప్రజలను కోరారు.

అంతరం వారి ఆహ్వానం మేరకు గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ సమస్యలను వివరించారు,జిల్లా ఇంచార్జీ మంత్రి గారి తో మాట్లాడి సమస్యలను పరిష్కారం చేద్దాం హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వడ్ల నవీన్ కుమార్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు రజనకు ప్రవీణ్ కుమార్ సీనియర్,ఏం మ్ సి డైరెక్టర్స్ స్టాలిన్ నర్సింలు, కాశబోయిన శ్రీనివాస్,వడియారం సర్పంచ్ సాయి కుమార్ గౌడ్, చేగుంట ఉపసర్పంచ్ రఫీ, చిన్న శివునూరు ఉపసర్పంచ్ బొల్ల ప్రశాంత్, కాంగ్రెస్ నాయకులు సంద్రుగు శ్రీకాంత్, సతీష్, నలిన్ గౌడ్,మండల కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ కశబోయిన మహేష్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మోహన్ నాయక్, గ్రామ కాంగ్రెస్ నాయకులు,గ్రామ వార్డు సభ్యులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు





# రోడ్డు భద్రత నియమాలు పాటించి ప్రమాదాలను నివారించాలి

### మద్యం, సెల్ ఫోన్, అతివేగంతోనే ప్రమాదాలు

### అరైవ్- ఆలివ్ లో ప్రజా ప్రతినిధులు భాగస్వాములై

### అవగాహన కల్పించాలి : ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్.

**పాపన్న పేట,మార్చి,26,మెదక్ టుడే న్యూస్:** రోడ్డు భద్రతా నియమాలు పాటించి ప్రమాదాలకు దూరంగా ఉండాలని పాపన్న పేట ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో "అర్రేవ్ అ లీవ్" కార్యక్రమం లో భాగంగా మండల ప్రజా పరిషత్ కార్యాలయం లో ఉపసర్పంచ్, వార్డు సభ్యులకు శిక్షణ కార్యక్రమంలో భాగంగా" అరైవ్ – అలైవ్" అవగాహన కల్పించారు.ఇందులో భాగంగా గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్లు, వార్డు సభ్యులు గ్రామ పంచాయతీ లలో ప్రజలకు ప్రమాదాల నివారణకు తమ వంతు గా ప్రజలకు రోడ్డు భద్రత, నియమాలు, నిబంధనల పై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వం రోడ్డు ప్రమాదాల నివారణకు ఎంతో ప్రాధాన్యత నిచ్చి అరైవ్– అలైవ్ కార్యక్రమం తో ప్రత్యేక కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పించాలన్న తలంపుతో చేపట్టిన వారోత్సవాల్లో బాగంగా మెదక్ ఎస్పీ శ్రీనివాస్ రావు ఆదేశాల మేరకు గురువారం ప్రజా ప్రతినిధులను సైతం అవగాహన సదస్సులో భాగస్వాములుగా చేయాలన్న తలంపుతో గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్, వార్డు సభ్యులకు అవగాహన కల్పించారు.వాహనదారులు హెల్మెట్ ధరించడం వల్ల ప్రాణాలకు రక్షణ కవచంల ఉంటుందని అందువల్ల ప్రతి ఒక్క వాహనదారుడు హెల్మెట్ తోపాటు సీటు బెల్టు ధరించాలన్నారు.రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా నిర్లక్ష్యం, అతివేగం,మద్యం సేవించి వాహనాలు నడపడం,హెల్మెట్, సీటుబెల్టుఉపయోగించకపోవడంవల్లజరుగుతున్నాయన్నారు. రోడ్డు భద్రత అనేది కేవలంపోలీసుల బాధ్యత మాత్రమే కాదని ప్రతి వాహనదారుడు ప్రతి పౌరుడు బాధ్యతగావ్యవహరించినప్పుడే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చునని ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని వారికి సూచించారు. ప్రజలు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తూ తమతో పాటు ఇతరుల ప్రాణాలను కాపాడుకోవాలని విజ్ఞప్తి చేశారు.వాహనదారులు వాహనాలు నడిపేటప్పుడు రాంగ్ రూట్లో నడపకూడదని తెలియజేశారు. డ్రైవింగ్ చేసేటప్పుడు సెల్‌ఫోన్లను ఉప యోగించొద్దని, సెల్ ఫోన్ లో ఇతరులతో మాట్లాడకుండా డ్రైవింగ్ చేయాలని సూచించారు.చలికాలంలో మంచు కారణంగా ఓవర్‌టేక్ చేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎంపీ ఇఓ , వివిధ గ్రామాల ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, శిక్షకులు పోలీసులు ఉన్నారు.







# అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు

### జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

**మెదక్,మార్చి,26,మెదక్ టుడే న్యూస్:ప్రతినిధి** జిల్లా స్థాయి సాండ్ కమిటీ సమావేశంలో జిల్లాలో ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదేశించారు. జిల్లాలో అక్రమంగా ఇసుక రవాణాచేస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. గురువారం మెదక్ కలెక్టరేట్లో నిర్వహించిన జిల్లా స్థాయి శాండ్ కమిటీ సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్, అదనపు ఎస్పీ మహేందర్, ఆర్డీవోలు తాసిల్దార్లు , మైనింగ్ ,ఇరిగేషన్, పంచాయతీ హౌసింగ్ అధికారులతో కలిసి తో కలిసి పాల్గొని మాట్లాడారు. జిల్లాలో ఏప్రిల్ 1 నుండి 100% ఇసుక సరఫరా "మన ఇసుక వాహనం" ద్వారా ఆన్‌లైన్ విధానంలోనే నిర్వహించాలని స్పష్టం చేశారు.ఇసుక రవాణా పూర్తిగా ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా జరగాలని అధికారులను ఆదేశించారు.ఇసుక అక్రమంగా ఇసుక రవాణా చేసే వాహనాలు పట్టుబడితే బైండోవర్ కేసులు నమోదు చేసి జరిమానా విధించాలని ఆదేశించారు. ప్రతి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు సకాలంలో ఇసుక అందించేందుకు ఆన్లైన్లో నమోదు చేయించాలన్నారు.పోలీస్, రెవెన్యూ, మైనింగ్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో ఒక మొబైల్ టీం ఏర్పాటు చేసి అక్రమంగా ఇసుక రవాణాను అడ్డుకోవాలన్నారు. తహసీల్దార్లు వారానికి కనీసం రెండు సార్లు రీచ్లను సందర్శించాలని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.





# క్యాపిటల్ ఇన్ఫర్మేషన్ ఆంగ్ల దినపత్రికలో స్టాఫ్ రిపోర్టర్‌గా టి. సాయికుమార్ నియామకం



**(స్పెషల్ కరస్పాండెంట్)షాద్ నగర్,మార్చి,26,మెదక్ టుడే న్యూస్:**క్యాపిటల్ ఇన్ఫర్మేషన్ ఆంగ్ల దినపత్రికలో ఫ్యూచర్ సిటీ విభాగానికి స్టాఫ్ రిపోర్టర్‌గా టి. సాయికుమార్‌ను



నియమించారు. ఈ సందర్భంగా స్పెషల్ కరస్పాండెంట్ డా. కొమ్ము వెంకన్న బాబు సాయికుమార్‌కు నియామక పత్రం మరియు ఐడి కార్డు అందజేశారు.ఈ సందర్భంగా డా. కొమ్ము వెంకన్న బాబు మాట్లాడుతూ, సాయికుమార్ జర్నలిజం రంగంలో నిబద్ధతతో పని చేసి పత్రికకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. వార్తల సేకరణలో నిజాయితీ, సమయపాలన ఎంతో ముఖ్యమని సూచించారు.స్టాఫ్ రిపోర్టర్‌గా నియమితులైన టి. సాయికుమార్ మాట్లాడుతూ, తనపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు తెలియజేసి, తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో పత్రిక ప్రతినిధులు మరియు స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.విభిన్న కథనాలతో, సెన్సేషనల్ ఆర్టికల్స్‌తో ప్రజల్లోకి వేగంగా చేరుకుంటూ, పాఠకుల ఆదరణ పొందుతున్న ఈ పత్రికను ఎడిటర్ శ్రీనివాసరావు నాయకత్వంలో తిరుగులేని ప్రముఖ దినపత్రికగా అభివర్ణించారు.

# లైంగికదాడి కేసులో నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష

### రూ. లక్ష జరిమానా విధించిన కోర్టుజిల్లా ఎస్పీ. డి. వి. శ్రీనివాస రావు




**మెదక్,మార్చి,26,మెదక్ టుడే న్యూస్: ప్రతినిధి** మహిళలు, చిన్నారులపై లైంగిక దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు తెలిపారు.తుప్రాన్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులో నిందితుడిని కోర్టు దోషిగా తేల్చి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధించినట్లు వెల్లడించారు.తుప్రాన్ పీఎస్ పరిధిలోని జండపల్లి గ్రామానికి చెందిన సోమగారి భాస్కర్ (27) బాలికపై లైంగిక దాడి పలుపడినట్లు ఫిర్యాదు అందడంతో అప్పటి ఎస్ఐ సురేష్ కుమార్ కేసు నమోదు చేశారు. అనంతరం అప్పటి దర్యాప్తు అధికారి సీఐ శ్రీధర్ సమగ్రంగా విచారణ జరిపి సాక్ష్యాధారాలను సేకరించి, పక్క ఆధారాలతో ఛార్జ్ షీట్ దాఖలు చేశారు. కేసును విచారించిన న్యాయమూర్తి ఆర్.ఎం. సుభావల్లి నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.1 లక్ష జరిమానా విధించినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు,జరిమానా మొత్తాన్ని బాధితురాలికి పరిహారంగా చెల్లించాలని కోర్టు ఆదేశించిదని తెలిపారు.కేసు విజయవంతంగా నడిపించడంలో స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం. బాలయ్య, భారోసా లీగల్ ఆఫీసర్ అడ్వకేట్ కే. స్వేత కీలక పాత్ర పోషించారు.తూప్రాన్ ఎస్సై గంగరాజు, జిల్లా లైజనింగ్ ఆఫీసర్ బి. విఠల్, పీసీలు జి. కృష్ణ, సీడిఓ నాగరాజు తదితరులు సమన్వయం చేశారు.ఇలాంటి కేసుల్లో వేగంగా దర్యాప్తు పూర్తి చేసి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు. మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని, ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

## సిసి రోడ్ పనులను ప్రారంభించిన సి హెచ్ శ్రీనివాస్ రెడ్డి

**చేగుంట మార్చ్ 26, మెదక్ టుడే న్యూస్**చేగుంట మండలోని చందాయిపేట గ్రామం లో ఎన్ ఆర్ జీఎస్ నిధుల ద్వారా



చేపడుతున్న 10లక్షలతో సీసీ రోడు పనులు గ్రామ సర్పంచ్ మహేశ్వరి సాయిబాబా వార్డు సభ్యులతో కలిసి ప్రారంభించిన దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి అనంతరం గ్రామ సమస్యలను వివరించారు,జిల్లా ఇంచార్జీ మంత్రి గారి తో మాట్లాడి సమస్యలను పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమం లో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వడ్ల నవీన్ కుమార్,మార్కెట్ కమిటీ డైరెక్టర్స్ మోజమిల్, స్టాలిన్ నర్సింలు, కాశబోయిన శ్రీనివాస్, దొంతి రెడ్డి బాల్ రెడ్డి,వడియారం సర్పంచ్ సాయి కుమార్ గౌడ్, కసంపల్లి సర్పంచ్ భిక్య నాయక్, ఉపసర్పంచ్ పబ్బ నగేష్, సాయిబాబా, బస రాజు,చిన్న శివునూరు ఉపసర్పంచ్ బొల్ల ప్రశాంత్, కాంగ్రెస్ నాయకులు సంద్రుగు శ్రీకాంత్,మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మోహన్ నాయక్, మాజీ సర్పంచ్ రాంపూర్ కాశబోయిన భాస్కర్,మాజీ సర్పంచ్ జగన్ గౌడ్, గ్రామ కాంగ్రెస్ నాయకులు,గ్రామ వార్డు సభ్యులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు

## మాదారం పంచముఖి హనుమాన్ విగ్రహా ప్రతిష్టాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే జిఎంఆర్



**జిన్నారం మార్చి :26(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి** ప్రజలలో భక్తి భావం పెంపొందించడంలో నూతన దేవాలయాల నిర్మాణాలు ఎంతగానో దోహదపడతాయని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. గడ్డ పోతారం మున్సిపల్ పరిధిలోని మాదారం గ్రామంలో నూతనంగా నిర్మించిన 42 అడుగుల పంచముఖి హనుమాన్ విగ్రహా ప్రతిష్టాపన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా స్థానిక రామాలయం దేవాలయం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పటాన్చెరు నియోజకవర్గంలోనే అతిపెద్ద పంచముఖి హనుమాన్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం పట్ల కమిటీ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, గడ్డపోతారం మున్సిపల్ చైర్మన్ గద్దె సుష్మా గణేష్, వైస్ చైర్మన్ మహేందర్ గౌడ్, మాజీ జెడ్పీటీసీ బాల్ రెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్ సురేందర్ గౌడ్, సీనియర్ నాయకులు వెంకటేష్ గౌడ్, స్థానిక కౌన్సిలర్లు, మాజీ ప్రజా ప్రతినిధులు, విగ్రహ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# రవీంద్రభారతీలో ఘనంగా ఎక్స్‌ప్లోరా వేడుకలు

**సంగారెడ్డి,మార్చి,26,మెదక్ టుడే న్యూస్:**హైదరాబాద్‌లోని రవీంద్ర భారతీ వేదికగా ఎక్స్‌ప్లోరా అవార్డుల ప్రదానోత్సవం ఘనంగా నిర్వహించారు. మాస్టర్ మైండ్, ఒక్లీ గ్రూప్ ఆఫ్ మరియు కృష్ణవేణి విద్యాసంస్థల ఛైర్మెన్ సంగాని రాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమంలో పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఎక్స్‌ప్లోరా పరీక్షలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులు: పి. అనుస్రీ (తండ్రి: పి. పాండు), దివ్యాన్ సింగ్ (తండ్రి: టి. లవ్మన్ సింగ్), చి. లౌక్య (తండ్రి: చి. రమేష్), కె. ధనుష్రీ (తండ్రి: కె. గౌరి నాయుడు), హిమ బిందు (తండ్రి: కె. సత్తయ్య), బి. చారిత (తండ్రి: బి. సిద్ధయ్య), బి. హారిత (తండ్రి: అశోక్ యాదవ్), కె. ఆదిత్య (తండ్రి: వెంకట రామకృష్ణ కిషోర్), ఆర్. సాయి చరణ్ రెడ్డి (తండ్రి: రెడ్డి సంగమేశ్).ముఖ్య అతిథులుగా మాజీ ఐఏఎస్ అధికారి డా. రాజు, డిఆర్డీవో శాస్త్రవేత్త డా. బి. శివకుమార్ హాజరై విద్యార్థులను అభినందించి, వారి భవిష్యత్తుకు మార్గదర్శక సూచనలు అందించారు.

ఈ కార్యక్రమం లో కృష్ణవేణి టాలెంట్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు సి.హెచ్ రాజేష్ ,ఇతర టీచర్లు కూడా కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులను అభినందించారు.విద్యార్థుల్లో విజ్ఞానాసక్తి, పోటీ భావన పెంపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.




# వడియారం గ్రామంలో సిసి రోడ్లకు శంకుస్థాపన చేసిన చెరుకు శ్రీనివాస్ రెడ్డి

### వడియారం గ్రామాన్ని అభివృద్ధి చేసే బాధ్యత నాది చెరుకు శ్రీనివాస్ రెడ్డి

**చేగుంట మార్చి 26 మెదక్ టుడే న్యూస్** చేగుంట మండలం వడియారం గ్రామంలో 20 లక్షల రూపాయలతో సీసీ రోడ్ల శంకుస్థాపన దుబ్బాక కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి చేయడం జరిగినది. వడియారం గ్రామ సర్పంచ్ సాయికుమార్ గౌడ్ గ్రామంలో ఉన్న సమస్యల గురించి చెప్పారు. చెరుకు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ వడియారం గ్రామంలో 20 లక్షల రూపాయలతో సీసీ రోడ్లు ప్రారంభించడం చాలా సంతోషకరంగా ఉన్నది. గత ప్రభుత్వం ఒక ఇల్లు కూడా ఇవ్వలేదు ప్రజా ప్రభుత్వం మన కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే వడియారం గ్రామానికి 32 ఇండ్లు మంజూరు చేయడం జరిగింది మళ్లీ వచ్చే ఎన్నికల్ల లోపల కచ్చితంగా వడియారం గ్రామంలో నిరుపేదలందరికీ ఇల్లు కట్టించే బాధ్యత కాంగ్రెస్ పార్టీది ప్రతి గల్లీలో సిసి డ్రైనేజీ అన్ని చేపించే బాధ్యత నాది, నూతన పంచాయతీ భవనానికి నిధులు ఇప్పించే బాధ్యత నాది మండలంలో ఉన్న గ్రామాల కంటే వడియారం గ్రామాన్ని అభివృద్ధి చేసే బాధ్యత నాది,మనది ప్రజా ప్రభుత్వం అని అన్నారు. గ్రామ సర్పంచ్ సాయికుమార్ గౌడ్ ఉపసర్పంచ్ నాగరాజు,వార్డ్ మెంబర్స్,జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు రజనకు ప్రవీణ్ కుమార్,చేగుంట కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నవీన్ కుమార్, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు,పాల్గొన్నారు





# ప్రజల సహకారంతోనే ప్రమాదాల నివారణ సాధ్యం

### మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు

### ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి: ఎస్పీ. డి. వి. శ్రీనివాస రావు

**మెదక్,మార్చి,26, మెదక్ టుడే న్యూస్:ప్రతినిధి** రోడ్డుప్రమాదాలను తగ్గించడంలో ట్రాఫిక్ నిబంధనలు పాటించడం అత్యంత కీలకమని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు తెలిపారు. మెదక్ టౌన్ పరిధిలోని బాలికల పాలిటెక్నిక్ కళాశాలలో 'అ రై వ్ అలివ్ ' మూడో విడత కార్యక్రమంలో భాగంగా రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ విద్యార్థులకు, యువతకు రోడ్డు భద్రతపై పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రోడ్డు మీద ప్రయాణించే ప్రతి ఒక్కరూ తమ భద్రతతో పాటు ఇతరుల భద్రతను కూడా దృష్టిలో పెట్టుకొని ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదాల సమయంలో తలకు గాయాలు తగ్గి ప్రాణాలను రక్షించుకోవచ్చని తెలిపారు. అలాగే నాలుగు చక్రాల వాహనాల్లో ప్రయాణించే వారు సీటుబెల్ట్ ధరించడం ద్వారా ప్రమాదాల తీవ్రతను తగ్గించవచ్చని వివరించారు.మద్యం సేవించి వాహనాలు నడపడం అత్యంత ప్రమాదకరమని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అధిక వేగంతో డ్రైవింగ్ చేయడం, నిర్లక్ష్యంగా వాహనం నడపడం, సెల్‌ఫోన్ ఉపయోగిస్తూ డ్రైవింగ్ చేయడం, మైనర్ డ్రైవింగ్ వంటి అలవాట్లు ప్రమాదాలకు ప్రధాన కారణాలని పేర్కొన్నారు. రాంగ్ రూట్‌లో ప్రయాణించడం, ఓవర్‌టేకింగ్ సమయంలో జాగ్రత్తలు పాటించకపోవడం కూడా ప్రమాదాలకు దారితీస్తుందని తెలిపారు. వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్, ఇన్సూరెన్స్, ప్యూసీ ( పి యు సి) వంటి అవసరమైన పత్రాలను ఎల్లప్పుడూ వెంట ఉంచుకోవాలని సూచించారు. చిన్నారులు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు కచ్చితంగా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని ఎస్పీ పేర్కొన్నారు.ప్రజల సహకారం ఉంటేనే సురక్షిత ప్రయాణం సాధ్యమవుతుందని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఆయన పిలుపునిచ్చారు. విద్యార్థులు తమ కుటుంబ సభ్యులకు కూడా ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్, డీఎస్పీ ప్రసన్న కుమార్, మెదక్ ఇన్స్పెక్టర్ మహేష్, అధ్యాపకులు, విద్యార్థులు, స్థానిక యువత, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.





printed published and owned by CHILVERA SHIVAKUMAR and printed JWAALA PRINTERS H.NO.- 10-15/1/A, KUMMARI GAINI,MANDAL PAPANNAPETA, DISTRICT, MEDAK, TELANGANA- 502303- Gmail. medaktoday94@gmail.com,Editor: CHILVERA SHIVAKUMAR. RNI NO, TELTEL 2023 ,88524, 9948265095.9494117870..